సాక్షి
నారాయణపేట
ఆదివారం : 7 ఏప్రిల్ : 2024





వేసవి.. ఉపాధి

వేసవిలో లభించే తాటిముంజలు విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు.

వివరాలు 8లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
42.9 /22.8

వాతావరణం

ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కూలీలకు కనీస వేతనం అందేలా చూడాలి

ఊట్కూరు: ఉపాధి కూలీలకు రోజువారి కనీస వేతనం వచ్చేలా అధికారులు పని కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం ఊట్కూరు పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీల పేర్లను మస్టర్‌లలో విధిగా రాయాలని, పని స్థలం వద్దకు మస్టర్‌లను తీసుకురావాలని అన్నారు. రోజువారి కూలీ ఎంతపడుతుందని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు పని చేసే ప్రాంతంలోతాగునీరు అందుబాటులో ఉండాలని, నీడనిచ్చేలా టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తిప్పరాస్‌పల్లి దగ్గర వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఊట్కూరు శివారు దగ్గర రెండు రైస్ మిల్లులను కలెక్టర్ తనిఖీ చేసి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఏపీఓ సత్యప్రకాష్, ఏఓ గణేష్‌రెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి హుస్సేన్, మహేష్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



నారాయణపేట: ఉపాధి కూలీలకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, అలాగే, రోజు వారి కూలీ రూ.600కు పెంచాలని, ఏడాదిలో 200 పనిదినాలు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు రోజుకు కూలీ పెంచాలని, పని చేసే ప్రదేశంలో తాగునీటి వసతి, టెంట్లు, ప్రథమ చికిత్స వైద్య కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర కనీస సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండ తీవ్రత పెరుగుతోందని ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాలని కోరారు. అదే విధంగా తెలంగాణ వ్యవసా కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలప్ప, గోపాల్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గడ్డపార, పావుడ, గంప తదితర పరికరాలు వెంటనే అందించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రం కలెక్టర్‌కు అందజేశారు. ధర్నాలో బాల్‌రాం, అంజిలయ్య గౌడ్, మహేష్‌కుమార్‌గౌడ్, హనుమంతు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలు..!



- జిల్లా కేంద్రంలో ఏడాది క్రితం మోడల్ అంగన్‌వాడీ ప్రీస్కూల్ ప్రారంభం
- చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు
- నర్సరీ నుంచే వ్యక్తిగత శుభ్రత, రంగుల గుర్తింపు తదితర వాటిపై అవగాహన
- చదువు అంటే భయం వీడి పాఠశాలకు పరుగులు
- వార్షికోత్సవానికి కలెక్టర్ హాజరు.. సిబ్బందికి అభినందనలు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ అంగన్‌వాడీ ప్రీస్కూల్ సత్ఫలితాలు ఇస్తోంది. పాఠశాల.. అంగన్‌వాడీ అంటేనే భయపడే పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తుండడంతో భయం వీడి అంగన్‌వాడీకి పరుగులు తీస్తున్నారు. ప్రైవేట్ పాఠశాల.. ప్లేస్కూల్‌కు ఏమాత్రం తీసిపోని రీతిలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రం ఉండడం, వసతులు కల్పించడం, చిన్నారుల్లో ఎంతో మార్పు రావడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా ప్రారంభం..

ఏడాది క్రితం జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్ ప్రాంతంలో కొనసాగుతున్న మోడల్ అంగన్‌వాడి ప్రీస్కూల్‌ను ప్రారంభించారు. కలెక్టర్ దీనిపై ప్రత్యేక చొరవ చూపడంతోపాటు వారి అబ్బాయిని మోడల్ అంగన్‌వాడీ ప్రీస్కూల్‌కు పంపించారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు ఇదే బాట పట్టారు. నర్సరీ నుంచి వ్యక్తిగత శుభ్రత, రంగుల గుర్తింపు తదితర వాటిపై అవగాహన కల్పించడం, పద్యాలు నేర్పించడంతో పిల్లల్లో ఎంతో మార్పు వచ్చింది. ఈక్రమంల స్కూల్‌ను కొనసాగిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ప్రీ స్కూల్‌లో పాఠ్యాంశాలు బోధిస్తున్న టీచర్లు, పిల్లలకు సపర్యలు చేస్తున్న ఆయాలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

అట్టహాసంగా వార్షికోత్సవం



జిల్లా కేంద్రంలోని మోడల్ అంగన్‌వాడీ ప్రీస్కూల్ వార్షికోత్సవంలో చిన్నారుల ఆటపాట

ఇదిలాఉండగా, శనివారం మోడల్ అంగన్‌వాడీ ప్రీస్కూల్ వార్షికోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే, డీడబ్ల్యూఓ నర్సింహ, జెడ్పీ ఇంచార్జీ సీఈఓ జ్యోతి, ఇంచార్జీ సీడీపీఓ శ్రీలత పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్‌అంగన్‌వాడి ప్రీ స్కూల్‌ను ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిందని, ఈ ప్రీ స్కూల్ నిర్వహణ తీరు బాగుందన్నారు. నిర్వహణను ఇంకా మెరుగు పర్చేందుకు చిన్నారుల తల్లులు తమ తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. కాగా కార్యక్రమ ప్రారంభోత్సవ పాట (వెల్ కమ్ సాంగ్)కు ప్రీ స్కూల్ చిన్నారులు తమ అభినయంతో కలెక్టర్‌తో పాటు అక్కడున్న వారందరినీ ఆకట్టుకున్నారు. ఈక్రమంలో కార్యక్రమానికి వచ్చిన కొందరు మాతృమూర్తులు ప్రీ స్కూల్ నిర్వహణపై తమ అభిప్రాయాలు తెలిపారు.

కలెక్టర్.. మాకు స్ఫూర్తి



కలెక్టర్ సార్.. మీరు మీ అబ్బాయిని మోడల్ అంగన్‌వాడీ స్కూల్‌కి పంపించినట్లు పేపర్లలో చూశాం. అది చూసిన తర్వాత నేను కూడా నా కుమారుడిని ప్రీ స్కూల్ లో చేర్పించాను. చిన్నపిల్లలకు ప్రయోగాత్మకంగా చదువు చెబుతున్నారు. మరో ఇద్దరు కూతుళ్లను పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నాను.

– పర్వీన్ బేగం, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు, పేట

అనర్గళంగా కథలు చెబుతున్నాడు..



ఈ ప్రీ స్కూల్‌లో చిన్నారులకు ఆట పాటలతో చదువు నేర్పిస్తున్నారు. ఇక్కడ చదువుతున్న నా కుమారుడు ప్రస్తుతం 12 కథలు చెబుతున్నాడు. నాకు చాలా సంతోషంగా ఉంది.

– మంజుల, విద్యార్థి తల్లి

ప్రైవేట్ కంటే బాగుంది..



మోడల్ అంగన్‌వాడీ ప్రీస్కూల్ ప్రైవేట్ స్కూల్ కంటే ఎంతో బాగుంది. ప్రైవేట్‌లోను ఇంత చక్కగా చదువు చెప్పే పరిస్థితి లేదు. ఇక్కడ సైతం పిల్లలకు ఒకే రకమైన యూనిఫామ్ ఉంటే బాగుంటుంది.

– అనురాధ, విద్యార్థి తల్లి

మాటలు నేర్చుకుంటుంది..



మా పాపను ఇక్కడ చేర్పించి కేవలం రెండు వారాలే అయింది. ఇది వరకు అంగన్‌వాడికి వెళ్దాం అంటే ఇంటి దగ్గర మారాం చేసి ఏడ్చేది. ఈ ప్రీ స్కూల్‌లో చేర్పించిన తర్వాత ఆ భయం పోయింది. చక్కగా మాటలు నేర్చుకుంటుంది.

– మమత, ప్రైవేట్ పాఠశాల టీచర్

చురుగ్గా మారారు..



మా బాబును ఈస్కూల్‌లో చేర్పించిన తర్వాత చాలా చురుకుగా మారాడు. ఇక్కడి టీచర్లు ఆటపాటలతో చదువు నేర్పిస్తున్నారు. చదువు అంటే భయం ఉంటుంది. కానీ ఇక్కడికి వచ్చేందుకు పిల్లలు ఎంతో ఇష్ట పడుతున్నారు. నా కుమారుడు కలర్స్ (రంగుల) పేర్లు ఇంగ్లీష్‌లో చక చక చెబుతున్నాడు.

– వనిత, విద్యార్థి తల్లి

హామీలు అమలు చేయాలి



ధర్నాలో ఎండిన పంటలను మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి చూపుతున్న రైతులు

నారాయణపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక మున్సిపల్ పార్కు దగ్గర భారత రాష్ట్ర సమితి పిలుపు మేరకు చేపట్టిన రైతుల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతుభరోసా పేరిట కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంకి వచ్చి 4 నెలలు అవుతున్నా హామీలను అమలు చేయకపోగా, రైతులను ఇష్టారీతిగా అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబంధు విడుదలలో జాప్యం, విద్యుత్ కోతలు, ధాన్యానికి రూ. 500 బోనస్ హామీ ఇచ్చి నిలబెట్టుకోకపోవటంతో కాంగ్రెస్ అనాలోచిత చర్యలతో 209 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అన్ని జిల్లాల్లో రైతు దీక్షలు చేయనున్నదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్ఠానం రైతులకు సకాలంలో రైతు బంధు, రైతు భీమా, వారికి బోనస్‌లు ఇవ్వాలన్నారు. ఈ దర్నాలో మాజీ మార్కెట్ చైర్మన్ మొసటిజ్యోతి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు భీయమ్య గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు వేపూరిరాములు, విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేట: తెలంగాణ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు ఈ నెల25 నుంచి ప్రారంభం కానుండడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్‌లో లైన్ డిపార్ట్‌మెంట్ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సి/ ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మూడు ఎస్ఎస్‌సి సెంటర్లు ఏర్పాటు చేయగా 750మంది విద్యార్థులు, ఇంటర్‌కు నాలుగు సెంటర్లు ఏర్పాటుచేయగా 1178 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. సమావేశంలో డీఈఓ అబ్దుల్ గని, డిటిఓ యాదగిరి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఎసిజిఈ రమేష్, వైద్యశాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నారాయణపేట: జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టామని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ తెలిపారు. జిల్లా ప్రజలకు అవసరయ్యే విధంగా తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని, మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 172 గ్రామాలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు (రిజర్వాయర్) నుంచి చందాపూర్ కుసుమద్‌పల్లి నీటి శుద్ధి కేంద్రం ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. కోయిల్‌సాగర్‌లో ప్రస్తుతం 0.83 టీఎంసీల నీళ్లు నిల్వ ఉందని, జూరాల బ్యాక్ వాటర్ ద్వారా జిల్లాలోని 59 గ్రామాలకు పారేవుల, నందిమల్ల పథకాలతో తాగునీరు అందిస్తున్నామని, ఈ వేసవికి జూరాలలో నీరు తగ్గినా సంగం బండ రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్న 0.7 టీఎంసీల నీళ్లల్లో 0.5 టీఎంసీలు తాగునీటికి వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం ద్వారా 180 గ్రామాలకు తాగునీటి సరఫరా నిత్యం చేస్తున్నారని, శ్రీశైలం నది జలాల నుంచి జూలై 15 వరకు నిరంతరం నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 280 గ్రామ పంచాయతీలలో 1312 బోర్ వెల్స్ ఉన్నాయని, వాటిలో 300 బోర్లకు మరమ్మతులు పూర్తయ్యాయని, అలాగే వివిధ గ్రామాల్లో 120 కొత్త బోర్లు వేశారని తెలిపారు. ఇక జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో పట్టణ వాసులకు తాగునీటి ఇబ్బందులు ఉండవని, జిల్లా కేంద్ర మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల జనాభా అవసరాలకు ప్రతి నిత్యం 7.30 ఎంఎల్‌డిల తాగునీరు అవసరం ఉండగా మిషన్ భగీరథ ద్వారా మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి రోజు 7.30 తాగునీటి సరఫరా చేస్తున్నరన్నారు. జిల్లాలోనీ అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ శాఖ ద్వారా ప్రతిరోజు నీటి సరఫరా పై పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

దివ్యాంగ ఉద్యోగస్తులకు మినహాయింపు ఇవ్వాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దివ్యాంగ ఉద్యోగుల సంఘం నాయకులు

నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికలలో దివ్యాంగుల ఉద్యోగస్తులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఏఓ నర్సింగ్‌రావుకు జిల్లా దివ్యాంగ ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. శారీరక, వినికిడి, అంధత్వ సమస్యలతో బాధపడుతున్న వారికి ఎన్నికలలో వీధుల్లో సామగ్రి రవాణా, ఎండాకాలం, తదితర విధులు నిర్వహించడంలో ఆటంకాలు ఎదురవుతాయని పేర్కొన్నారు. విన్నవించిన వారిలో దివ్యాంగుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కమ్లానాయక్, జనరల్ సెక్రటరీ రహమాన్‌లు ఉన్నారు.

బడ్జెట్ సమావేశం రసాభాస

- పది మంది సంతకాలతో ఆమోదం
- మొదట సమస్యలపై చర్చించాలని వైస్‌చైర్మన్ డిమాండ్
- బయటికి వెళ్లిపోయిన బీజేపీ కౌన్సిలర్లు



బడ్జెట్ సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న వైస్‌చైర్మన్ హరినారాయణభట్టడ్



కౌన్సిల్ నుంచి బయటికి వెళ్తున్న బీజేపీ కౌన్సిలర్లు

నారాయణపేట: మొదట జీరో హవర్ నిర్వహించి సమస్యలు విన్నవిద్దాం.. వాటి పరిష్కారానికి అధికారులు ఏం చెబుతారో విందాం.. ఆ తర్వాతే సంతకాలు చేయడం.. బడ్జెట్‌పై సమావేశం నిర్వహిద్దామంటూ.. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్ మున్సిపల్ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గందె అనసూయ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశం రసాభాసగా సాగింది. ఈ సమావేశం ప్రారంభం నుంచి వైస్ చైర్మన్ తన అసంతృప్తిని వెళ్లగక్కారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అంటే పట్టింపు లేదని, కమిషనర్ సమస్యలు పట్టించుకోవడం లేదని, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తదే పెత్తనం నడుస్తుందంటూ ఆరోపించారు. మున్సిపాలిటీకి అభివృద్ధికి రూ.కోట్లు వస్తే ఎక్కడ అభివృద్ధి జరిగిందంటూ ప్రశ్నించారు. సైన్స్‌పార్కు పనుల్లో రూ.1.20 కోట్లు ఎందుకు ఎస్టిమేట్ వేశారో చెప్పాలని నిలదీశారు. ఇందుకు ఇంజినీర్ సమాధానం ఇస్తూ అప్పటి కలెక్టర్ సూచన మేరకు సైన్స్‌పార్కులో చేపట్టే వివిధ పనులకు అంచనాలు మారాయన్నారు. మున్సిపాలిటీకి రూ.కోట్లు వచ్చాయని చెబుతున్నారు.. డ్రైనేజీలు, సిసి రోడ్లు ఎందుకు పూర్తి కాలేదని, తమ వార్డులో ఒక్క పని తప్పా ఇంత వరకు ఎలాంటి పనులు చేపట్టలేదంటూ వైస్ చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు కాకముందే అందరూ కౌన్సిల్ సభ్యులతో ప్రియంబుల్స్ పై చర్చించి పనులు పెట్టాల్సి పోయి ఒక్కసారైనా మాట్లాడారా అంటూ ప్రశ్నించారు. ఇందుకు బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులంతా అధికారులను సైతం ప్రశ్నించడంతో మిన్నకుండిపోయారు. పలువురు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై మాట్లాడారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించినప్పుడు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించరు కానీ అప్పుడు, ఇప్పుడు చేస్తామని హామీలు ఇస్తూ ముందుకు నెడుతున్నారే తప్పా అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు.



బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ సంతకం చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బడ్జెట్ ఆమోదం

ఈ నెల 8న ఎమ్మెల్యే వస్తున్నారని అప్పటి వరకు ఈ బడ్జెట్‌ను వాయిదా వేయాలంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్ బడ్జెట్ సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయారు. దీంతో బీజేపీతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు పలువురు బయటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత పది నిమిషాల్లోనే బీఆర్ఎస్ కౌన్సిలర్ మెఘా శ్రీపాద్ బడ్జెట్ అమోదానికి తొలి సంతకం చేయగా.. మున్సిపల్ చైర్‌పర్సన్, తోటి కౌన్సిలర్లు బండి రాజేశ్వరి, అమ్మపల్లి శిరిషా, గురులింగం, అమీరుద్దీన్, బయటికి వెళ్లిన కాంగ్రెస్ కౌన్సిలర్ సరిత సైతం కౌన్సిల్ హాలుకు వచ్చి సంతకం చేసింది. ఎంఐఎం కౌన్సిలర్ తఖీచాంద్, ఇండిపెండెంట్ కౌన్సిలర్, బీఆర్ఎస్ మిగిలిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను చైర్‌పర్సన్ భర్తతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఫోన్ చేసి రప్పించి సంతకాలు చేయించారు. పది మంది సంతకాలు చేయడంతో బడ్జెట్ ఆమోదం అయినట్లు అయిందంటూ అధికారులు వెల్లడించారు. సమావేశంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ సత్య రఘుపాల్, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



జిల్లా కేంద్రంలో బీజేపీ జెండావిష్కరిస్తున్న నామాజీ

నారాయణపేట రూరల్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కమల వికాసమే లక్ష్యంగా పని చేద్దామని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావునామాజీ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పార్టీ కార్యాలయలంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రతంగపాండురెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు సంఘ్ పరివార్ ఏర్పాటుకు కారకులైన శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాల్, భరతమాత చిత్రపటాలకు పూజలు చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో 23కోట్లకు పైగా సభ్యత్వం కలిగిన ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఆవిర్భవించిందన్నారు. మోదీ నేతృత్వంలో ఎన్నో హామీలను నెరవేర్చడమే కాకుండా ప్రకటన చేయని ఎన్నో కార్యక్రమాలు చేసి చూపించిన ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కిందన్నారు. ప్రపంచ దేశాలకే భారతావని ఒక చుక్కానిలా మారిందన్నారు. రాబోవు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గెలుపు ఎవరు అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘురామయ్యగౌడ్, సత్యాయాదవ్, లక్ష్మి, నందునామాజి, సైదప్ప, మిర్చివెంకటయ్య, శ్యామ్ సుందర్, రాము పాల్గొన్నారు.



బీజేపీ టిఫిన్ బైఠక్‌లో పాల్గొన్న నాయకులు

బీజేపీ టిఫిన్ బైఠక్..

బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేంద్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని వార్డుల్లో బీజేపీ నాయకులు తమ ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్లతో సహా పంక్తి టీఫిన్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, బీజేపీ కౌన్సిలర్లు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రగామి

- పీయూ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్

- వివరాలు 10లో..

దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

కోయిల్‌కొండ: దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోదీపూర్‌లో జరుగుతున్న ఆంజనేయస్వామి ఉత్సావాల్లో వారు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యపడుతుందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం హామీ మేరకు వందరోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిందన్నారు. అనంతరం వారు మోదీపూర్‌తండాలో పర్యటించారు.జి.రవీందర్, వై.మహేందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

మోదీపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



క్లుప్తంగా

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం


వినాయక మఠపతి (ఫైల్)

పెబ్బేరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రంగాపురం జాతీయ రహదారి 44పై వేరుహౌస్ గోదాం దగ్గర చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, బళ్లారి గ్రామానికి చెందిన వినాయక మఠపతి (25) హైదరాబాద్‌లోని హఫీజ్‌పేటలోని జెన్‌ప్యాక్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి తన స్వగ్రామం బళ్లారికి బైక్‌పై బయలు దేరాడు. మార్గ మధ్యలో పెబ్బేరు మండలం, రంగాపురం వద్ద జాతీయ రహదారి 44పై వేరుహౌస్ గోదాం దగ్గర బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రోడ్డుమధ్యలో పడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న మరో వాహనం వినాయక మఠపతిపై వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన తండ్రి గురు సంగయ్య మఠపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్‌కి చెందిన జంగయ్య(58) గ్రామ శివారులోని చెట్టుకు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య అరుణమ్మ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల కృష్ణవేణి షుగర్ ప్యాక్టరీలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన ఆంజనేయులు (34) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. భూత్పూర్‌కు చెందిన నక్క ఆంజనేయులు కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఫ్యాక్టరీలోని బొగ్గు తయారయ్యే సెంటర్‌లో ఈనెల 2న రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మండుతున్న బొగ్గు ఒక్కసారిగా ఆంజనేయులుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికుల సహాయంతో ఫ్యాక్టరీ యాజమాన్యం అతడిని చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ, అక్కడి నుంచి రెయిన్‌బో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈర్లదిన్నెలో మరో మహిళ..

అమరచింత: కల్లు తాగిన మైకంలో గొంతును కత్తితో కోసుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుర్వ జయమ్మ(45) శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ సంఘటన ఈర్లదిన్నెలో చోటుచేసుకుందని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం కల్లుతాగి ఇంటికి వచ్చిన జయమ్మ ఇంట్లో ఉన్న కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన రాములు(38) గల్లంతు అయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బంధువుల దశదినకర్మలో భాగంగా రాములు గ్రామంలోని భీమా సముద్రం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈదుతూ చెరువు మధ్యలోకి వెళ్లి నీట మునిగాడు. ఎంతకీ బయటకు రాలేదు. కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం ఇవ్వగా వారు గాలింపు చర్యలు చేపట్టారు.

వేసవి.. ఉపాధి

జోరుగా తాటి ముంజల విక్రయాలు

- అడుగంటిన భూగర్భ జలాలతో ఈసారి తగ్గిన కాపు
- రోజుకు రూ.వెయ్యికి పైగా సంపాదిస్తున్నామంటున్న మహిళలు




చిన్నవార్వాల్‌లో తాటి చెట్టు

గండేడ్: వేసవి వచ్చిందంటే చాలు చల్లచల్లగా తినాలనిపించే తాటి ముంజలు కనిపిస్తాయి. ఇవి తినేవారికి చలువ చేయడమేగాక గ్రామీణులకు సుమారు మూడునెలల పాటు ఉపాధి కూడా కల్పిస్తున్నాయి. రైతులు వ్యవసాయంతో అనుబంధంగా తాటి ముంజల విక్రయాలు చేపడుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది సగం మేర మాత్రమే కాపు కాసింది.

ముంబాయి, హైదరాబాద్‌కు ఎగుమతి..



గండేడ్ మండలంతో పాటు పక్కనే గల వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని రుసుంపల్లి ,చిన్నవార్వాల్, పుట్టపహాడ్, అంతారం, ఘనాపూర్ తదితర గ్రామాల్లో తాటి చెట్ల సంఖ్య అధికంగా ఉండటంతో ఇక్కడి నుంచి తాటి ముంజలు ముంబాయి, హైదరాబాద్‌కు ఎగుమతి అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పొద్దుపొద్దునే నోరూరించే తాటి కల్లుతో పాటు ముంజలు ఎక్కువగా లభిస్తాయి. ఏటా గంపల కొద్ది తాటి ముంజలు బస్సులు, రైళ్లలో తీసుకెళ్లి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. స్థానికంగా 100 తాటి ముంజలను రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తుండగా.. వ్యాపారులు మాత్రం వికారాబాద్ జిల్లా తాండూరు, కొడంగల్, పరిగి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా పరిదిలోని మహబూబ్‌నగర్, హన్వాడ, నారాయణపేట జిల్లా పరిదిలోని గుండుమాల్, కోస్గి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి రెండు, మూడింతల ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఆయా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ఎక్కడ చూసినా తాటి ముంజలే దర్శనమిస్తాయి.

సగానికి తగ్గిన దిగుబడి..

ఎండల తీవ్రత, అడుగంటిన భూగర్భ జలాలు తాటిమంజల దిగుబడిపై ప్రభావం చూపాయి. వర్షాకాలంలో ఆశించిన మేర వానలు కురవకపోవడంతో చెట్లకు సరిపడా నీరందలేదు. దీంతో ఈ ఏడాది దిగుబడి సగానికి తగ్గిందని స్థానికులు అంటున్నారు.

మహిళలకు ఉపాధి..

తాటి ముంజల విక్రయంతో ప్రధానంగా మహిళలు ఉపాధి పొందుతున్నారు. కొందరు సొంత పొలాల్లో ఉన్న చెట్ల నుంచి వచ్చే ముంజలు విక్రయించి ఉపాధి పొందుతుండగా.. మరికొందరు కొనుగోలు చేసి రహదారులకు ఇరువైపులా, గ్రామాల్లో తిరిగి అమ్ముతున్నా రు. రూ.100కు 12 తాటి ముంజలు అమ్ముతున్నారు. సాయంత్రం వరకు అన్ని ఖర్చులపో ను రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఆయా ప్రాంతాల్లోని వందల మంది మహిళలు ఏటా వేసవిలో తాటిముంజలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మగవారు గెలలు కోసిస్తే మహిళలు వాటిని ఓపికగా చెట్ల కింద కూర్చొని విక్రయిస్తున్నారు.

తాండూరుకు తీసుకెళ్లి విక్రయిస్తా..



సొంత పొలంలో 30 చెట్లు ఉండగా.. వేరే వారివి మరో 30 చెట్లు కొనుక్కున్నాం. ఆయా చెట్లకు కాసిన గెలల్ని కోసివ్వగా అమ్మ వాటిని తాండూరుకు తీసుకెళ్లి విక్రయించుకొస్తుంది. స్థానికంగా మేము కూడా విక్రయిస్తాం. ఖర్చులన్నీ పోను రోజు సుమారు రూ.2 వేల వరకు వస్తున్నాయి. సుమారు రెండునెలల పాటు ఉపాధి లభిస్తుంది. ఎండకాలంలో మాత్రమే కాసే వీటికి మార్కెట్లో భలే డిమాండ్ ఉంది.

– నందిమళ్ల శ్రీశైలం, చిన్నవార్వాల్, గండేడ్

వ్యవసాయం చేస్తూనే..



ఉన్న మూడెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూనే వేసవిలో వేరే వాళ్ల దగ్గర తాటి ముంజలు కొనుగోలు చేసి విక్రయిస్తాను. సీజన్ అయిపోయే వరకు కూలీ కంటే ఎక్కువ డబ్బులే సంపాదిస్తా. గతంలో రూ.300కు 100 ముంజలు వచ్చేవి. ఈసారి ఎండల కారణంగా కాపు తక్కువగా ఉండటంతో రూ.500 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుంది.

– సుజాత, కుల్కచర్ల, వికారాబాద్

నాగర్‌కర్నూల్‌కు గుర్తింపు తీసుకొస్తా

- బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కొల్లాపూర్: 'కృష్ణానది నీళ్లు తాగి పెరిగా.. అలంపూర్‌లో పుట్టిన.. అచ్చంపేటలో చదువుకున్నా.. గురుకులాల కార్యదర్శిగా పనిచేసి పేద విద్యార్థులకు చదువుతో పాటు పౌష్టికాహారం అందించాం.. ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారు.. ఏడేళ్ల సర్వీసు వదులకొని ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చా.. సొంత ప్రాంతానికి సేవ చేసేందుకు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా.. గెలిపిస్తే పార్లమెంట్‌లో మీ గొంతుక వినిపించి నాగర్‌కర్నూల్‌ను దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా.' అని బీఆర్‌ఎస్‌పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఎం గార్డెన్స్‌లో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయనతో పాటు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు ఉగ్గాణి బజ్జీ, జొన్న రొట్టె, పులిచింతల కూర తిన్న తనకు.. ఊతప్పం, దిబ్బరొట్టె తిన్న మల్లు రవికి మధ్య జరుగుతున్న పోరన్నారు. స్థానికేతరుడైన మల్లు రవి గెలుపునకు మంత్రి జూపల్లి కృష్ణారావు తిరగడం చిత్రంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో సేల్‌ట్యాక్స్‌తో పాటు కాంగ్రెస్ ట్యాక్స్ కూడా నడుస్తోందని.. డబ్బులతో పాటు మద్యం కుమ్మరించి గెలిచేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని ఆరోపించారు. కొల్లాపూర్‌లో పోలీసులు అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని.. ఇది సరైంది కాదన్నారు. కొల్లాపూర్‌లో ఇటీవల నమోదైన పలు కేసుల గురించి సమావేశంలో వివరించారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మంత్రులపై నిరంజన్‌రెడ్డి ధ్వజం..

నీటి వనరుల వినియోగంపై అవగాహన లేక రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి కృష్ణా బేసిన్‌లో మినహా మిగిలిన అన్నింటిలో నీరు సమృద్ధిగానే ఉందని.. ఇందుకు ఐఎండీ నివేదికలే నిదర్శనమన్నారు. పాలమూరు ప్రాజెక్టు పనులు 20 శాతం మాత్రమే పూర్తయితే రెండున్నర టీఎంసీల నీటిని ఎలా ఎత్తిపోశామని.. పనులు తుదిదశకు చేరకుంటే మంత్రి పొంగులేటి నార్లాపూర్ రిజర్వాయర్ పనులకు సంబంధించి 90 శాతం బిల్లులు ఎలా తీసుకున్నారో సమాధానం చెప్పాలని కోరారు. కొల్లాపూర్‌లో మిషన్ భగీరథ పనులు ఎవరి హయాంలో జరిగాయని.. అందులో అవినీతి జరిగితే దానికి మంత్రి జూపల్లి కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రి పదవులు అనుభవించి, డబ్బులు సంపాధించుకొని ఇప్పుడు ఆయనపైనే విమర్శలు చేయడం సరికాదని తెలిపారు. స్థానికుడైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించుకుంటే ప్రజలకు అండగా ఉంటాడని చెప్పారు.

కాంగ్రెస్ అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలు నమ్మి గెలిపించారు.. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా నేటికీ ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని, కాంగ్రెస్ అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. అక్రమ కేసులు నమోదు చేయించడంలో ఉన్న శ్రద్ధ 167కే జాతీయ రహదారి, కృష్ణానదిపై వంతెన, మినీ లిఫ్టుల నిర్మాణం, మామిడి మార్కెట్, ఉద్యాన కళాశాల భవనం నిర్మించి చూడాలని మంత్రి జూపల్లిని కోరారు. సమావేశంలో ఎంపీపీలు సోమేశ్వరమ్మ, మాలె రజిత భాస్కర్‌గౌడ్, నాయకులు రంగినేని అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, రాంచందర్ యాదవ్, నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, రామన్‌గౌడ్, రాజేష్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మిక ఆశ్రమంలో అగ్ని ప్రమాదం


అప్పాయపల్లిలో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమ

లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లిలోని ఆధ్యాత్మిక ఆశ్రమం(ఓంకార అచల పీఠం)లో శనివారం ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటనలో దుస్తులు, పూజా సామగ్రి, వంట పాత్రలు, నిత్యావసర సరకులు, సంగీత వాయిద్య పరికరాలు, రూ.30 వేల నగదు కాలి బూడిదయినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని కొంత మంది వ్యక్తులు కలిసి ఆశ్రమాన్ని నిర్మించుకొని భక్తి గీతాలు, భజనలు, కోలాటాలు ఇందులో సాధన చేస్తున్నారు. ప్రమాద సమయంలో ఆశ్రమంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఉమ, ఏఆర్‌ఐ అనిల్‌కుమార్ పరిశీలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రి

జడ్చర్ల: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన స్థానిక విద్యానగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. యజమాని మధుసూదన్ కుటుంబంతో కలిసి శుక్రవారం ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లారు. శనివారం వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. కాగా బీరువాలో దాచిన 70 తులాల వెండి నగలు, రూ.40వేలు నగదుతో పాటు రూ.లక్ష విలువ చేసే పట్టు చీరలు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక సీఐ ఆదిరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని విచారించారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిల్వ ఉన్న ధాన్యానికి నిప్పు

- రూ. 2లక్షల ఆస్తినష్టం


కాలిబూడిదైన వేరుశనగ పంట

అచ్చంపేట రూరల్: వ్యవసాయ పొలం వద్ద నిల్వ ఉంచిన ధాన్యానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన ఘటన మండలంలోని అక్కారంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొర్ర లాలు తన కున్న రెండెకరాల వ్యవసాయ పొలంలో వేరుశనగ పంట, చిరు ధాన్యాలు పండించాడు. విక్రయించడానికి పొలం వద్దనే ధాన్యాన్ని నిల్వ చేశాడు. శుక్రవారం శుభకార్యానికి లాలు కుటుంబ సభ్యులతో పాటు వెళ్లారు. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. మొత్తం అంటుకుని పక్కనే ఉన్న 2 క్వింటాళ్ల వేరు శనగ పంట, ఉలువలు, పెబ్బర్లు, 60 స్ప్రింక్లర్ పైపులు, 25 స్ప్రింక్లర్ నల్లాలు, 4 ట్రాక్టర్ల వేరుశనగ పొల్లు, గుడిసెలో ఉన్న ఇతర వ్యవసాయ పనిముట్లు కాలి బూడిదయ్యాయి. సమీప రైతులు లాలుకు సమాచారం ఇవ్వడంతో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూసి కన్నీరుమున్నీరయ్యాడు. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ఈ విషయమై సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నాడు.

నల్లమలలో కార్చిచ్చు

మన్ననూర్: నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతంలోని అమ్రాబాద్ రేంజ్ పరిధిలో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. బోరెడ్డిపల్లె వాగు, తాళ్ల చెలుక తదితర ప్రాంతాల్లో మంటలు వ్యాపించి, సుమారు 25 హెక్టార్లలో అడవి కాలిపోయిందని సమాచారం. మంటలు వ్యాపించిన ప్రాంతానికి అటవీ సిబ్బంది రెండు ట్రాక్టర్లలో నీటితో పాటు బ్రోజర్లు, చెట్ల కొమ్మలతో చేరుకుని, మంటలను అదుపుచేసే ప్రయత్నం చేస్తున్నారు. మొదట ప్రధాన రహదారి నుంచి మంటలు ప్రారంభమై.. అటవీ లోతట్టు ప్రాంతంలోకి వ్యాపించినట్లు శ్రీశైలం ప్రధాన రహదారి గుండా వెళ్లే ప్రయాణికుల ద్వారా తెలిసింది.

తాగివచ్చి వేధిస్తున్నాడని..

భర్త గొంతు కోసిన భార్య


గాయపడిన హుస్సేన్

మిడ్జిల్: మండల పరిధిలోని చిల్వేర్‌లో శుక్రవారం అర్ధరాత్రి భర్త గొంతు కోసిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లెపల్లి హుస్సేన్‌ను తన భార్య అలివేల బ్లేడ్‌తో గొంతు కోసింది. హుస్సేన్ తరచూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని, వేధింపులు భరించలేక, రాత్రి నిద్రించిన తర్వాత ఈ సంఘటనకు పాల్పడినట్లు చెప్పారు. తీవ్ర గాయాలు కాగా.. పక్కనే ఉన్న బాధితుడి తండ్రి బాలయ్య గమనించి చికిత్స నిమిత్తం 108లో జడ్చర్లకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు శనివారం అలివేలపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీఓకు గాయాలు

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో పెద్దమందడి ఎంపీడీఓకు గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎంపీవో శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిగట్లలో చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు పంచాయతీ కార్యదర్శి సతీష్ బైక్‌పై ఎంపీడఓ సద్గుణ వెళ్లారు. ఉపాధి పనులు పరిశీలించి, కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని తిరిగి పెద్దమందడి కార్యాలయానికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అడవిపంది ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో బైక్ అడవిపందిని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి కిందపడి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో వారిని పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎంపీడీఓ ఆరోగ్య పరిస్థితి నిలకడగ ఉన్నట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

అల్లం సాగు.. లాభాలు బాగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్



అలంపూర్: వ్యవసాయంలోనూ నూతన పంటల సాగుపై రైతుల ఆసక్తి కనబరుస్తున్నారు. సాంప్రదాయ పంటల సాగులో వస్తున్న నష్టాల నుంచి గట్టెక్కడానికి అన్నదాతలు వాణిజ్య పంటల సాగుపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అనేక రకాలైన వాణిజ్య పంటలు సాగు చేసి రైతులు ఫలితాలను సాధిస్తున్నారు. ఆ కోణంలోనే అల్లం పంట సాగు చేసి లాభాలను ఆర్జిస్తున్నారు. వరి కంటే తక్కు నీటితో అల్లం పంట సాగు చేసే అవకాశం ఉండటంతో అనేక మంది రైతులు అల్లం పంట సాగులో నిమగ్నమై లాభాల బాటలో పయనిస్తున్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు అల్లం పంట సాగుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

అనువైన నేలలు..

అల్లం సాగుకు ఎర్ర నేలలు అనువుగా ఉంటాయి. నీరు నిల్వ ఉండని నేలల్లో పంట సాగు అనుకూలం. వరి సాగుతో పోల్చితే నీటి వినియోగం చాలా తక్కువ. ఎకరా పొలంలో వరి సాగు చేయడానికి కావాల్సిన నీటితో ఒక్కటిన్నర ఎకరంలో అల్లం సాగు చేసుకునే వెసలుబాటు ఉంటుంది.

రకాలు– లభ్యత..

మారన్ విత్తనాలు మంచి దిగుబడినిస్తాయి. దీనిని కేరళ నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. మహావ రకం మహారాష్ట్రలో లభిస్తోంది. ఇవేకాక కేరళలో ఎర్నాడ్, వేనాడ్, కరుప్పం పాడి, నడియా రకాలు ప్రసిద్ధిగాంచినవి.

పంట సాగు కాలం..

అల్లం సాగు పంట ఎనిమిది నుంచి తొమ్మిది నెలల్లో పంట చేతికి అందుతుంది. పంట కాలం తర్వాత పంటను మార్కెట్‌కు తరలించుకోవచ్చు.

దుక్కి ఇలా...

అల్లం సాగులో దుక్కి చాలా ముఖ్యమైంది. దుక్కిని 30 సెంటీమీటర్ల లోతు వరకు దున్నుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 ట్రక్కుల బాగా చిలికిన పశువుల ఎరువు, 150 కిలోల సూపర్, 30 కిలోల పొటాష్ వేసుకోవాలి. కనీసం 30 సెంటీమీటర్ల ఎత్తు, బోదె పైభాగం, 90 సెంటీమీటర్లు ఉండేలా 4 అడుగుల వెడల్పుతో బోదెలు తయారు చేసుకోవాలి. నీటి తడుల కోసం బోదెల మధ్య ఇన్‌లైన్ డ్రిప్ అమర్చుకోవాలి.

విత్తన మోతాదు..

ఎకరానికి 1000 కిలో విత్తనాలు కావాల్సి ఉంటుంది. 20 రోజుల పాటు కుప్పగా వేసి మండె కట్టాలి. మండె కట్టిన 20 రోజుల తర్వాత విత్తిన దుంపలు చిన్న చిన్న మొలకలు రాగానే వాటిని 30 గ్రామాల బరువు ఉండేలా కత్తిరించాలి. వీటిని లీటర్ నీటికి 3 గ్రాముల మాంకోజెబ్, 2 మిల్లీ లీటర్ల క్లోరోఫైరిపాస్ కలిపి 30 నిమిషాలు నానబెట్టి భూమిలో విత్తాలి. విత్తిన 3 నుంచి 5 వారాల్లో పూర్తిగా మొలక వస్తోంది. ప్రతి రోజు 6 గంటల పాటు డ్రిప్‌తో నీటిని అందించాలి.

విత్తే సమయం..

సాధారణ సమయాల్లో రైతులు జూన్ మాసంలోనే అల్లం పంట సాగు చేసుకోవచ్చు. నీటి పారుదల ఉంటే ఫిబ్రవరిలో లేదా మార్చి నెలల్లో నాటుకోవచ్చు.

ఎరువులు..

పిలక దశలో మొదటి నాలుగు నెలలు యూరియా, 20:20 ఎరువులు రోజు మార్చి రోజు డ్రిప్ ద్వారా అందించాలి. దుంప ఎదుగుదల దశలో 13:0:45 ఎరువులను 3 నుంచి 5 నెలల వరకు ప్రతి నెల ఒక సారి ఇవ్వాలి. వీటితో పాటు మెగ్నీషియం సల్ఫేట్, కాల్షియం నైట్రేట్ ఇవ్వాలి.

తెగుళ్ల యాజమాన్యం..

అల్లం సాగులో ప్రధానంగా దుంప కుళ్లు తెగులు, బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు. వీటితో 30 నుంచి 50 శాతం వరకు పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. దుంప కుళ్లను గుర్తిస్తే.. మెటలాక్సిల్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి వేరు ప్రాంతం తడిచేలా పోయాలి. ఇలా పది రోజుల వ్యవధిలో రెండు సార్లు చేయాల్సి ఉంటుంది.

వేడి గాలుల నుంచి రక్షణ..

అల్లం మొలకెత్తిన తర్వాత బోదెలకు రెండు వైపులకు కింది భాగంలో 30 సెంటీమీటర్ల దూరంలో మొక్కజొన్న నాటుకోవాలి. దీంతో పిలక దశలో అల్లం పంటను వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవచ్చు.

దిగుబడి..

ఎకరానికి 15 నుంచి 20 టన్నుల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో 30 వేల వరకు పలుకుతుంది. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం సమకురే అవకాశం ఉంది.

మోసానికి మారుపేరు

అబద్ధాలు, వెన్నుపోటు, మోసం, కుట్రలు కలిపితే చంద్రబాబు

కావలి బహిరంగ సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'మోసం, అబద్ధాలు, వెన్నుపోట్లు, కుట్రలు.. ఈ పాత్రలన్నీ కలిపితే చంద్రబాబు. సినిమాల్లో విలన్ క్యారెక్టర్లలో మనకు నచ్చనివన్నీ కలిపితే పుట్టే కొత్త క్యారెక్టర్ అన్నమాట. ఈ క్యారెక్టర్.. చంద్రబాబును నాలుగు నెలలుగా నేను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నా. 14 ఏళ్లు సీఎంగా చేశావు.. 3 సార్లు సీఎంగా చేశానని చెప్పుకుంటావు. మరి నీ పేరు చెబితే పేదలకు గుర్తుకొచ్చే పథకం కనీసం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? నువ్వు చేసిన మంచి పని ఏదైనా ఉందా? మీ ముందే, మీ సమక్షంలో.. ఇలా సిద్ధం సభల్లో లక్షలాది మంది ముందు ఇప్పటికే ఎన్నోసార్లు అడిగాను. నాకైతే సమాధానం చెప్పలేదు.మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం ఆయన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి బహిరంగ సభలో మాట్లాడారు. ఐదు వారాల్లో జరగనున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును, మన పేదల ఇంటింటి భవిష్యత్తును నిర్ణయించేవని, కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కాదని గుర్తుంచుకోవాలని చెప్పారు. మీ ఓటు ఐదేళ్ల కాలంలో మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు.

బాబు చేతిలో కీలుబొమ్మ సునీత

- 2019లో కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌ను ఖరారు చేసిన వైఎస్ జగన్
- అవినాశ్ గెలుపు కోసం చివరి వరకూ కృషి చేసిన వివేకా
- అయినా కొన్నేళ్లుగా సునీత దుష్ప్రచారం
- తాజాగా పులివెందుల ఉప ఎన్నికల అభ్యర్థిత్వంపై అవాస్తవాలు
- హేతుబద్ధ ప్రశ్నలు సంధిస్తే సమాధానం కరువు
- వివేకా రెండో వివాహంతోనే ఆ కుటుంబంలో విభేదాలు

ఏపీ వార్తలు, వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అన్నదాత భగీరథ ప్రయత్నం!



సాగర్ బ్యాక్ వాటర్ వెనక్కి వెళ్లిపోవడంతో నీటిని పంటలకు తరలించేందుకు పెద్దవూర మండలం పొట్టితండా రైతులు తవ్విన బావి



మోటార్లతో నీటిని తరలించేందుకు కిలోమీటర్ల పొడవున రైతులు వేసుకున్న పైప్‌లైన్లు

- నల్లగొండ జిల్లాలో పంటలను కాపాడుకోవడానికి రైతుల తంటాలు
- సాగర్ జలాశయం అడుగంటడంతో బ్యాక్ వాటర్‌లో తేలిన భూములు
- వాటిల్లో బావులు తవ్వి, 8 కి.మీ. దాకా పైపులు వేసి నీటి తరలింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఆరుగాలం శ్రమించి వేసుకున్న పంటలను కాపాడుకొనేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కళ్ల ముందే ఎండిపోతున్న పంటలను బతికించుకొనేందుకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. కరువు కారణంగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోవడంతో పంటలను ఎలాగైనా కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో ఇప్పటికే వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోగా సాగర్ బ్యాక్ వాటర్ కింద సాగు చేసుకుంటున్న రైతులు పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా బత్తాయి, మామిడి వంటి పండ్ల తోటలతోపాటు వేరుశనగ, వరి పంటలను బతికించుకొనేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ముఖ్యంగా సాగర్ జలాశయం డెడ్ స్టోరేజికి చేరడంతో బ్యాక్ వాటర్ కిలోమీటర్ల మేర తగ్గిపోయింది. దీంతో నల్లగొండ జిల్లా పీఏ పల్లి మండలంలోని నంభాపురం, పెద్దగట్టు, పుట్టంగండి తదితర ప్రాంతాల్లో గిరిజన రైతులు పంటకు నీరందించేందుకు కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు వేసుకొని మోటార్లు పెట్టి నీటిని తరలిస్తున్నారు. పెద్దవూర మండలం పొత్తితండా, పర్వేదుల తదితర గ్రామాల రైతులు పదుల సంఖ్యలో సాగర్ వెనుక జలాశయంలోని లోతట్టు ప్రాంతాల్లో కొద్దిపాటి నీళ్లు ఉన్న ప్రదేశాలకు దూరంగా బావులు తవ్వి అక్కడి నుంచి 7–8 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసుకుంటున్నారు.

పంటల కోసం తంటాలు పడుతున్నాం



పంటలు ఎండిపోకుండా నానా తంటాలు పడుతున్నాం. అప్పులు చేసి మరీ పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నాం. నాగార్జునసాగర్ జలాశయం డెడ్ స్టోరేజికి చేరడంతో బ్యాక్ వాటర్ నుంచి పంటలకు నీటిని అందించేందుకు కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్లు వేస్తున్నాం. – రమావత్ పత్తి, నంభాపురం

మత్తడివాగు మట్టికట్ట తవ్విన రైతులు

తాంసి: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఇప్పటికే వాగులు, చెరువులు నీరు లేక అడుగంటిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు సైతం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టును నమ్ముకొని కుడికాలువ కింద పంటలు సాగు చేసిన రైతులు ప్రస్తుతం నీరందక ఇబ్బంది పడుతున్నారు. ప్రాజెక్టు నీళ్లలోనే వీరు మోటార్లు ఏర్పాటు చేసుకొని పైపులైన్ ద్వారా పంటలకు నీరు అందించేవారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు తగ్గడంతో మోటార్లకు నీరందడం లేదు. కానీ కాలువ వైపు నీరు రాకుండా కాంట్రాక్టర్ గతంలో తాత్కాలికంగా మట్టికట్ట నిర్మించి.. పనులు ముగిసిన అనంతరం తొలగించకుండా వదిలేశాడు. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి కట్ట నీరు రావడానికి అడ్డంకిగా ఉండటంతో.. రైతులు దానిని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు రైతులు శనివారం తమ మోటార్ల వైపు నీరు వచ్చేలా కట్టను తవ్వేసి నీటిని మళ్లించుకున్నారు. ప్రస్తుతం నీరు అందకపోతే సాగు చేసిన వేరుశనగ, జొన్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు పేర్కొన్నారు.



ప్రాజెక్టులో సాగునీటి కోసం కాలువ వైపు తవ్వుతున్న రైతులు

శరీరాలపై నుంచి లారీ వెళ్లడంతో

- దేహాలు ఛిద్రమై.. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- బైక్ అదుపుతప్పి రోడ్డుపై చెరో వైపు పడిన భర్త, భార్యాపిల్లలు
- భార్య, ఇద్దరు బాలికలపై దూసుకెళ్లిన లారీ.. అక్కడికక్కడే మృతి
- మృతులు ఏపీ వాసులు.. మండలపల్లి శివారులో ఘటన

దమ్మపేట: లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన చీపు బాలకృష్ణ తన భార్య లక్ష్మి(23), కుమార్తెలు చరణశ్రీ(8), షణ్మితశ్రీ(6)తో కలసి బైక్‌పై ఖమ్మం జిల్లా వీఎం బంజర నుంచి అశ్వారావుపేట వైపునకు కోళ్లఫారంలో పనికి కుదిరే నిమిత్తం వెళ్తున్నాడు. ఈక్రమంలో మందలపల్లిలోని ప్రభు నర్సరీ సమీపాన లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఎదురుగా మరో వాహనం అడ్డొచ్చింది. ఆ వాహనం సైడ్ మిర్రర్ బైక్‌కు తగలడంతో అదుపు తప్పింది. బాలకృష్ణ ఓ వైపు పడిపోగా మిగిలిన ముగ్గురు కుటుంబ సభ్యులు మరోవైపు పడిపోయారు. ముగ్గురు కుటుంబ సభ్యుల మీదుగా వెనుక నుంచి వస్తోన్న లారీ దూసుకెళ్లడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందారు. లారీ శరీరాల పైనుంచి వెళ్లడంతో ముగ్గురి దేహాలు ఛిద్రం కాగా.. శరీర భాగాలు తెగిపోయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంకో వైపు పడిపోయిన బాలకృష్ణ కాళ్లకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. బాలకృష్ణను దమ్మపేట ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లల మృతదేహాలను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. బాలకృష్ణతో స్థానికులు మాట్లాడి వివరాలు ఆరా తీసే క్రమంలో... తాను ప్రేమ వివాహం చేసుకుని, తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నామని చెప్పుకొచ్చిన ఆయన తన భార్యాపిల్లలకు ఏమైందో చెప్పాలని అడగడం స్థానికులకు కలచివేసింది.



లక్ష్మి (ఫైల్)



చరణశ్రీ, షణ్మితశ్రీ (ఫైల్)

ట్యాపింగ్‌పై నివేదిక అడగండి

- సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడండి
- గవర్నర్ రాధాకృష్ణన్‌కు బీజేపీ ప్రతినిధి బృందం వినతి

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని కేంద్ర హోంశాఖకు తెలియజేయడంతో పాటు ఈ అంశం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది కావ డంతో సీబీఐ ద్వారా సమగ్ర విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. 2014–2023 మధ్య బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేట్‌వ్యక్తుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసిన వ్య వహారంపై ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సాగుతున్న దర్యాప్తునకు సంబంధించిన వివిధ అంశాలను బీజేపీ ప్రతినిధి బృందం గవర్నర్ దృష్టికి తీసుకొచ్చింది. ఈ వ్యవహారంలో వచ్చిన ఆరోపణల తీవ్రత, చోటు చేసుకున్న పరిణామాలను బట్టి చూస్తే దేశభద్రత, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ కు భంగం కలుగుతున్నందున గవర్నర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌కు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎన్.రామచంద్రరావు, చింతల రామచంద్రా రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎన్వీసుభాష్, కొల్లి మాధవి వినతిపత్రం సమర్పించారు. రాజ్‌భవన్ వద్ద డా.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎక్కడా లేని విధంగా గతప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. ట్యాపింగ్ కేసు లో ఇప్పుడు కేవలం పాత్రధారులు మాత్రమే అరెస్ట్ అవుతున్నారని, సూ త్రధారుల సంగతి బయటి రావడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ ఎంతటి వారైనా విడిచిపెట్టమని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారనీ..కానీ బీఆర్ఎస్ సుప్రీమో పేరు వినిపిస్తున్నా.. ఎవరనేది బయట పెట్టడం లేదన్నారు.



గవర్నర్‌ను కలిసి బయటకు వస్తున్న కె. లక్ష్మణ్, ఎన్.రాంచందర్‌రావు తదితరులు

డీఆర్‌వీ ప్రసాదరావుకు రాష్ట్రస్థాయి అవార్డు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ కరెన్సీ, నాణేల సేకరణ కర్త, విద్యుత్‌శాఖ ఉద్యోగి డీఆర్‌వీ ప్రసాదరావు రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో జోష్ నేషనల్ ఫిల్మ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో డీఆర్‌వీ ప్రసాదరావు నంది అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో నటులు రచ్చరవి, మురళీధర్, అజయ్‌ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

'అమర్ రాజా' పనులను వెంటనే ఆపాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎదిర సమీపంలో అమర్ రాజా బ్యాటరీ గిగా ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం శ్రీనివాస్‌సాగర్ అన్నారు. ఈ మేరకు సమాజ్ ఆధ్వర్యంలో కలెక్టర్ రవినాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌సాగర్ మాట్లాడారు. సదరు ప్రాజెక్టు నుంచి విపరీతమైన కాలుష్యం ఏర్పడే ప్రమాదముందని తెలిపారు. బ్యాటరీ తయారీలో వాడే కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటివి విషపూరితమైనవని మానవ మనుగడకు హాని తలపెడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతే కాకుండా అక్కడి నుంచి వెలువడే వాయువులు, కలుషితమైన నీటి వల్ల ప్రజలు క్యాన్సర్, గుండె సంబంధ వ్యాధులబారినపడే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రాజెక్ట్ అనుమతులపై మరోసారి పరిశీలించాలన్నారు. విచారణ జరిగే వరకు ప్రాజెక్ట్‌కు సంబంధించిన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ కో కన్వీనర్ సవారి సత్యం తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రగామి

- పీయూ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రగామిగా నిలుస్తుందని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పీయూలో శనివారం ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ఇండియన్ ఎకనామి, గ్రోత్ అండ్ ప్రాస్పెక్ట్స్' అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ దశాబ్ద కాలంలో భారత్ గణనీయమైన వృద్ధి సాధించిందన్నారు. ఆర్థిక వ్యవస్థ పరిపుష్టిగా ఉండాలంటే, స్వదేశీ ఉత్పత్తులు, ఎగుమతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో మరింత వృద్ధి సాధించే ఆస్కారం ఉంటుందన్నారు. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఎల్లప్పుడూ పరిశోధనా దృక్పథంతో ఆలోచించాలని.. తద్వారా సబ్జెక్టుపై మరింత ఆసక్తి పెరుగుతుందని సూచించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామి డైరెక్టర్ టీఎల్ఎన్ స్వామి మాట్లాడుతూ వాతావరణ ప్రభావం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో పెను సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. భారత్ మాత్రం మంచి వృద్ధిని నమోదు చేయడం గొప్ప విషయమన్నారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆర్థిక వ్యవస్థకు ఊపునిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ జిమ్మాకార్టన్, కంట్రోలర్ రాజ్‌కుమార్, వెంకటరాఘవేంద్ర, శివలింగం, రాజ్‌నాయక్ పాల్గొన్నారు.

అయిస్టర్ సంస్థతో ఒప్పందం

పీయూలో యూత్ ఓరియంటేషన్ కార్యక్రమాలను నిర్వహించేందుకుగాను అయిస్టర్ సంస్థతో శనివారం ఒప్పందం కుదుర్చుకున్నారు. గతంలో చేసుకున్న ఒప్పందం గడువు ముగియగా.. తాజాగా మరో సారి ఒప్పందం చేసుకున్నట్లు పీయూ అధికారులు తెలిపారు. విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెంచేందుకుగాను ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

బీజేపీతోనే మాదిగలకు ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ. చిత్రంలో ఎంపీ రాములు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

నాగర్‌కర్నూల్: మాదిగల ప్రయోజనాలను కాపాడేది ఒక్క బీజేపీ మాత్రమేనని.. ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీ తప్ప, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో కాదని తేలిపోయిందని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని డీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపాలని, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కాంగ్రెస్ పార్టీని కోరినా స్పందించలేదన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ ఎంతో అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో 70 శాతం ఉన్న మాదిగలకు మూడు ఎంపీ సీట్లలో ఒక్కటి కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్‌లో స్థానికుడు కాని మల్లురవి, వరంగల్‌లో సిట్టింగ్ ఎంపీని కాదని బైండ్ల కులానికి చెందిన కడియం కావ్యకు ఇచ్చారన్నారు. ఉపఎన్నికలు జరగాల్సిన కంటోన్మెంట్ అసెంబ్లీ సీటును సైతం మాల సామాజిక వర్గానికి చెందిన గణేష్‌కు ప్రకటించారని తెలిపారు. ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే.. 2018 నవంబర్ 6న ఎస్సీ వర్గీకరణ కోసం ధర్నా చేస్తుంటే, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి మద్దతు ప్రకటిస్తామని కేసీఆర్ చెప్పి, మోసం చేశారన్నారు. మరోమారు ధర్నా చేస్తే.. అరెస్ట్ చేసి, జైలుకు పంపారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జరిగిన మాదిగల సభకు ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానిస్తే.. ఎస్సీ వర్గీకరణ విషయంలో హామీ ఇవ్వడమే కాకుండా, కమిటీ కూడా వేశారన్నారు. అందుకే మోదీపై నమ్మకం పెరిగిందన్నారు. అయోధ్యలో రాముడి గుడి కట్టడాన్ని అపార్థం చేసుకోవద్దని.. 500 ఏళ్ల చిరకాల కాంక్షను నిజం చేసిన వ్యక్తి మోదీ అన్నారు. క్రైస్తవులు జెరూసలెం వెళ్తారని.. ముస్లింలు మక్కా వెళ్తారని.. అలాంటిది రాముడిని కొలిచేవారు అయోధ్య వెళ్తే తప్పేంటని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో పాటు ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోదీకి.. ఎస్సీ వర్గీకరణ అంశం పెద్ద సమస్యకాదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీచేస్తున్న భరత్ ప్రసాద్‌ను గెలిపించాలని.. ఎస్సీ వర్గీకరణపై భరత్ ప్రసాద్ తన గళం విప్పుతారన్న నమ్మకం తమకు ఉందన్నారు. ఎంపీ రాములు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇచ్చిన హామీ మేరకు బీజేపీలో చేరినట్లు చెప్పారు. మాదిగ సామాజిక వర్గానికి ఎక్కడా చెడ్డపేరు రాకుండా క్రమశిక్షణతో ఇన్నాళ్లు రాజకీయం చేశానన్నారు. ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ తనకు మద్దతు తెలిపేందుకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తనను గెలిపిస్తే మందకృష్ణ పోరాటంలో భాగస్వామినై పార్లమెంట్‌లో గళం విప్పుతానన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, నాయకులు దిలీపాచారి, కోళ్ల శివ, జక్కా రఘునందన్‌రెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

రామన్‌పాడులో 1,012 అడుగుల నీరు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం శనివారం1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వార వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిరుత మృతి

- మహబూబ్‌నగర్ జిల్లా కొమిరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఘటన

అడ్డాకుల: జాతీయ రహదారి దాటుతున్న ఓ చిరుతను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులో శనివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. శనివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో స్థానిక సోలార్ ప్లాంట్ వైపు నుంచి వచ్చిన చిరుత 44వ నంబర్ జాతీయ రహదారిని దాటేందుకు యత్నించింది. ఈ క్రమంలో కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం చిరుతను ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే చిరుత మృతిచెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డుపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో చిరుత కళేబరాన్ని డివైడర్ పైకి తీసుకెళ్లారు. మూసాపేట, అడ్డాకుల ఎస్ఐలు సుజాత, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వారు వచ్చి చిరుత కళేబరాన్ని జిల్లాకేంద్రానికి తరలించారు. ఇదిలా ఉండగా గతంలో భూత్పూర్ మండలం తాటికొండ శివారులో రహదారి పక్కన చిరుత కళేబరం లభించిన తర్వాత ఇక్కడ మరో చిరుత రోడ్డు దాటుతూ మృతిచెందడం ఆందోళన కలిగిస్తోంది.



చిరుత కళేబరం

ఇక్కడ సంచరిస్తున్నదేనా?

మూసాపేట మండలంలోని వేముల, తుంకినీపూర్, చక్రాపూర్, సంకలమద్ది శివారులో ఆరు నెలల క్రితం ఓ చిరుత సంచరించింది. లేగ దూడలు, గేదెలపై దాడి చేసి చంపడంతో అప్పట్లో గొర్రెల కాపరులు, పాడి రైతులు ఆందోళన చెందారు. ఆ తర్వాత మళ్లీ చిరుత సంచారం లేకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ అకస్మాత్తుగా చిరుత రోడ్డు దాటుతూ మృతిచెందడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ చిరుత గతంలో ఇక్కడ సంచరిస్తున్నదే అయ్యి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.

శక్తిమంత ప్రక్రియ కవిత్వం

- కవి, అధ్యాపకుడు నరసింహాశర్మ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భావాలను ప్రభావవంతంగా వ్యక్తీకరించే శక్తిమంత ప్రక్రియ కవిత్వమని కవి, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా.నాయికంటి నరసింహాశర్మ అన్నారు. శనివారం తెలంగాణ సాహితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాగ్దేవి జూనియర్ కళాశాలలో క్రోధినామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 56 మంది కవులు తమ కవితలను వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ మార్పులో కవిత్వం పాత్ర గొప్పదని పేర్కొన్నారు. తెలుగు పండుగలు ఉగాది తోనే ఆరంభమవుతాయన్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, సలహాదారు టి.భాస్కరయ్య, జిల్లా అధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, ప్రధాన కార్యదర్శి కొప్పోలు యాదయ్య, ప్రచార కార్యదర్శి ఆర్.ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం



ఒకే కాన్పులో పుట్టిన ముగ్గురు శిశువులు

నారాయణపేట: సాధారణంగా కాన్పులు జరిగితే ఒకరు లేదా ఇద్దరు జన్మించడం చూస్తుంటాం. అయితే శనివారం నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. వివరాల్లోకి వెళ్తే.. పేట మండలం కొల్లంపల్లికి చెందిన లక్ష్మి మొదటి ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో రక్తహీనత ఉండటంతో యువశక్తి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ తరపున బీ పాజిటివ్ బ్లడ్ డొనేట్ చేయించి రక్తం అందించారు. ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షల అనంతరం సాధారణ ప్రసవం చేయగా.. లక్ష్మికి ముగ్గురు శిశువులు జన్మించారు. వీరిలో ఒక మగ, ఇద్దరు ఆడ శిశువులు(ఒక్కొక్కరు సుమారు 1.5 కిలోల బరువు)తో ఉన్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరిటెండెంట్ రంజిత్‌కుమార్ స్పందిస్తూ ఒకే కాన్పులో ముగ్గురు జన్మించడం చాలా అరుదు అన్నారు. ప్రస్తుతం లక్ష్మి, జన్మించిన ముగ్గురు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు.